

- ఉదయం 9నుంచే సుర్రుమంటున్న సూరీడు
- రోడ్డెక్కాలంటే జంకుతున్న జనం
- గతరెండు రోజులుగా 40డిగ్రీలకుపైగా టెంపరేచర్

హైదరాబాద్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త:
నగరంలో బానుడు భగభగతో నగర వాసులు మండిపోతున్నారు. ఉదయం 9గంటలనుంచే ఎండలు దంచికొడుతుంటే భయటికి రావాలంటే జంకుతున్నారు. గత రెండు రోజుల నుంచి చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.వేడిగాలులూ సిటీ శివారులోని సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ ఏరియాల్లో ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఎప్పుడూ రద్దీగా కనిపించే సిటీ రోడ్లు మధ్యాహ్నం బోసిపోయి కనిపిస్తున్నాయి. వచ్చే అయిదు రోజులు ఇదే విధంగా ఎండలు దంచికొడతాయని, హీట్ వేవ్స్ ప్రభావం కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వీలైనంత వరకు ప్రజలు మధ్యాహ్నం ఎండలో తిరగొద్దని, ఇండ్లలోనే ఉండాలని కోరింది. తగినంత నీరు తీసుకోవాలని, క్యాప్ పెట్టుకోవాలని సూచించింది. వేసవికాలంలో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో బయటకు వెళ్లడం ప్రమాదకరమని చెబుతున్నారు. ఈ సమయంలో సన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చెమట రాకపోవడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సన్ స్ట్రోక్ బ్రెయిన్‌పై ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో నిరక్ష్యం చేయొద్దని చెబుతున్నారు. చిన్నారులు వడదెబ్బకు గురైతే జ్వరం, దద్దుర్లు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. డీహైడ్రేషన్ వల్ల గంటల తరబడి మూత్రం రాకపోవడం, శ్వాసలో ఇబ్బంది వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. కాబట్టి చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలుపుతున్నారు.

పెద్దల పైనా ఎండ ప్రభావం :
ఎండ తీవ్రత పెద్దలపై కూడా ప్రమాదకరంగానే ఉంటుంది. ముఖ్యంగా కూలీలు, నిర్మాణ కార్మికులు మిట్టమధ్యాహ్నం ఎండలో పని చేస్తుంటారు. దీని వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వృద్ధులు, మధు మేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

వడదెబ్బ లక్షణాల్లో అధిక చెమటలు, నీరసం, తలనొప్పి, వాంతులు కనిపిస్తాయి. డీహైడ్రేషన్ అధికమైతే చెమటలు కూడా ఆగిపోతాయి. తీవ్రమైన పరిస్థి తుల్లో అపస్మారక స్థితి కూడా రావచ్చు. ఈ లక్షణాలను నిరక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని వైద్యులు పే ర్కొంటున్నారు.

గ్రేటర్‌లో పెరగనున్న అసెంబ్లీ స్థానాలు

-కొత్తగా మరో 22 నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం



హైదరాబాద్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:
రాబోయే ఎన్నికల నాటికి రాజధాని నగరం హైదరాబాద్, నగరాన్ని ఆనుకొని ఉన్న ఇరుగుపొరుగు జిల్లాల్లో కొత్తగా 22 అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడ నున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల పునర్ విభజన చేసేందుకు నిర్ణయించడంతోపాటు 50 శాతం స్థానాలను పెంచేందుకు కేంద్రం ఓకే చెప్పడంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో 22 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి.
ఈ మేరకు కొత్త నేతలకు అవకాశాలు లభించనున్నాయి. శాసనసభా నియోజకవర్గాలు, లోక్ సభస్థానాలు 50 శాతం పెరగనుండటంతో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతమున్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలు 183కి పెరగనున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. 2011 లెక్కల మేరకు హైదరాబాద్ జిల్లా జనాభా 39,43,323. ఒక్కో అసెంబ్లీకి సగటుజనాభా 1.93 లక్షలను పరిగణనలోకి తీసుకుంటే ఈ జిల్లాలో 20 అసెంబ్లీ సీట్లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 15 శాసనసభా స్థానాలకు తోడు కొత్తగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయన్నయన్నమాట. అలాగే మేడ్చల్ జిల్లా జనాభా 24,60,095. ఈ లెక్కన ఈ జిల్లాలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. అంటే ప్రస్తుతం ఉన్న ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు తోడు అదనంగా మరో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటవుతాయి.
రంగారెడ్డి జిల్లా జనాభా 24,46,265. ఈ లెక్కన ఈ జిల్లాలో కూడా 13 అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 8 అసెంబ్లీ (కల్వకుర్తి పాక్షికం) నియోజకవర్గాలకు అదనంగా మరో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. ఇదే లెక్కన వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతమున్న అసెంబ్లీ స్థానాలకు అదనంగా మరో నియోజకవర్గం, సంగారెడ్డి జిల్లాలో మరో 3 నియోజకవర్గాలు ఆవిర్భవిస్తాయి. మొత్తం ఐదు జిల్లాల పరిధిలో కొత్తగా 22 అసెంబ్లీ నియోజకవర్గాలతో పునర్విభజన జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు కానున్న 63 శాసనసభ నియోజకవర్గాల్లో 22 ఇక్కడే ఏర్పాటు కానున్నాయి. అంటే మూడో వంతుకు పైగా ఇక్కడే ఏర్పడనున్నాయి. ఒక నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లాలో ఉండటంతో పాటు జీహెచ్ఎంసీకి ఒక సర్కిల్ లేదా జోన్ సైతం ఒకే జిల్లాలో జీహెచ్ఎంసీ పునర్విభజన సందర్భంగానూ అధికారులు జాగ్రత్త వహించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి : వినయ్‌కృష్ణారెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:
పారిశుధ్య నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సరూర్‌నగర్ సర్కిల్ కొత్తపేట, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని నాగేశ్వరరావునగర్ కాలనీలోని తెలంగాణ పార్కు, కొత్తపేట అష్టలక్ష్మి ఆర్చి, టెలిఫోన్‌కాలనీ, హుడాకాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో గురువారం స్థానిక అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు. ఆయా కాలనీలలోని మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ నిర్వహణకు సంబంధించి అధికారులు సిబ్బందితో కమిషనర్ మాట్లాడారు. పలు ప్రాంతాల్లో వ్యర్థాల నిర్వహణ, మరమ్మత్తు పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన ఇసుక, తడి పూడిక, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. అజయ్ నివాస్ ఫేజ్ ఎ వద్ద లీకవుతున్న

కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

కుళాయికి తక్షణ మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ప్రతిఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. హుడాకాంప్లెక్స్‌లో వాణిజ్య సముదాయాలను పరిశీలించిన కమిషనర్ ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేసి లైసెన్స్‌లు స్పష్టంగా కనిపించే విధంగా దుకాణాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ పార్కులో నిర్వహణపై దృష్టి సారించాలని, మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పోయాలని, పార్కును శుభ్రంగా పచ్చగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కిషన్‌బాగ్‌లో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

-ప్రమాదాలు బారిన పడుతున్న ప్రజలు

చార్మినార్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త : పాతబస్తీ కిషన్‌బాగ్ డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచెలు లేక పోవటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. కంచె లేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటేనే ప్రజలు భయ పడుతున్నారు. విద్యుత్ బిల్లులు వసూళ్లపై ఉన్న శ్రద్ద అధికారులకు పసతులు కల్పించటంలో లేదని కిషన్‌బాగ్ డివిజన్ వాసులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు చుట్టూ కంచెలు నెలకొల్పాలని పలు మార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు.కిషన్‌బాగ్ డివిజన్ నజాంనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కేబుళ్లు రహదారి ప్రక్కనే ఉండటంతో ప్రజలు నడిచి వెళ్ళాలంటనే భయ పడుతున్నారు.ప్రధానంగా చిన్న పిల్లలు,మహిళలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

నజాంనగర్‌లో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కాగా కిషన్‌బాగ్ ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇదే పరిస్థితి ఉంది .ట్రాన్స్‌ఫార్మర్‌కు అతి దగ్గరలో ప్రభుత్వం ఉన్నత పాఠశాల ఉంది.ప్రతీ రోజు వందలాది మంది విద్యార్థులు ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కనే నుంచే నడుచుకుంటూ పాఠశాలకు వెళుతుంటారు.కేబుళు వైర్లు కిందికి ఉన్నాయి.స్థానిక ప్రజలు ఇబ్బందులు పాలవుతున్న అధికారులు మాత్రం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు చుట్టూకంచెలు ఏర్పాటు

కిషన్‌బాగ్ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చేయక పోవంటం పట్ల నిరసన తెలియజేస్తున్నారు.ఇటీవల నయాపూల్ శీతల మాత దేవాలయం వద్ద రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటంతో టిజిఎస్‌పిటిసిఎల్‌కు దాదాపు ఇరవై లక్షల రూపాయలు నష్టం జరిగింది .కిషన్ బాగ్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతు న్నారు.

కూకట్‌పల్లిలో గ్యాస్, పెట్రోల్ మాఫియా దందా

ఎసిబి దాడులకు ప్రజల డిమాండ్!

మూసాపేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త
కూకట్‌పల్లి ప్రాంతంలో కమర్షియల్ గ్యాస్, పెట్రోల్ సరఫరా పేరుతో జరుగుతున్న భారీ అక్రమాలు సామాన్య ప్రజలను, చిన్న వ్యాపారులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల యజమానులు కుమ్మక్కై సృష్టిస్తున్న ఈ కృత్రిమ కొరతపై తెలంగాణ ఏసీబీ అధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఈసేవా కేంద్రాల్లో అధిక ధరలపై దాడులు చేసిన తరహాలోనే, గ్యాస్ డీలర్ల ఆగడాలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరుతున్నారు.గ్యాస్ సిలిండర్ల పంపిణీలో డీలర్లు "మేము ఎంత చెబితే అంత" అన్నట్లుగా వ్యవహరిస్తూ బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం అధికారిక ధరకే డీలర్లకు సరఫరా చేస్తున్నప్పటికీ, వారు మాత్రం చిన్న వ్యాపారులకు వాస్తవ ధరతో కూడిన బిల్లులు ఇవ్వకుండా, దయదాక్షిణ్యాలతో ఇస్తున్నట్లుగా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలతో నేరుగా సంబంధం లేని చిన్న టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు నడిపే వారిని లక్ష్యంగా చేసుకుని మూడు నుండి నాలుగు రెట్లు అధిక ధర వసూలు చేస్తున్నారు. గ్యాస్ కొరత లేని సమయంలో కూడా కొత్త కనెక్షన్ల కోసం వెళ్తే.. స్టవ్ కొనుగోలు, తనిఖీలు, మెయింటెనెన్స్ పేర్లతో వెయ్యిపదిహేను వందల రూపాయల వరకు అదనంగా దండుకునే డీలర్లు, ప్రస్తుతం కమర్షియల్

గ్యాస్ రూపంలో అధిక దోపిడీ చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో సైతం స్పీడ్ పెట్రోల్ పేరుతో దోపిడీ పతాక స్థాయికి చేరింది. సాధారణ పెట్రోల్‌ను అందుబాటులో ఉంచకుండా, కేవలం స్పీడ్ పెట్రోల్ మాత్రమే విక్రయిస్తూ ప్రతి లీటరుకు ఆరు రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే స్పీడ్ పేరుతో కూడా సాధారణ పెట్రోలే పోస్తున్నారన్న అనుమానాలు వాహనదారుల్లో వ్యక్తమవుతున్నాయి. లీగల్ మెట్రాలజీ అధికారులు కేవలం సినిమా థియేటర్లు, చాపల మార్కెట్లపై మాత్రమే దృష్టి పెట్టడం తప్ప, సామాన్యుడిని నిలువునా ముంచుతున్న ఈ గ్యాస్, పెట్రోల్ మాఫియా వైపు చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు.ఈ గ్యాస్, పెట్రోల్ ధరల ప్రభావం సామాన్యుడి భోజనం, టిఫిన్ ధరలపై పడి మధ్యతరగతి జీవనం ఛిద్రమవుతోంది. ఈ గందరగోళ పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, ప్రతి గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంక్ వద్ద సంబంధిత అధికారుల నంబర్లు పెద్ద అక్షరాలతో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, చిన్న వ్యాపారులకు అండగా నిలిచే స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగేళ్ల బాలుడికి యాసిడ్ తాగించిన మహిళ

బోడుప్పల్‌లో వెలుగులోకి అమానవీయ ఘటన

ఉప్పల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : తన పిల్లల కంటే తోడి కోడలి పిల్లలపైనే మామ ప్రేమగా ఉంటున్నారనే కారణంతో ఒక మహిళ నాలుగేళ్ల బాలుడికి జ్యూస్ అని చెప్పి యాసిడ్ తాగించిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..బోడుప్పల్ శ్రీనివాస కాలనీకి చెందిన పర్వతం నాగరాజు, సంధ్య దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు కార్తీక్ వాసు (4) స్థానికంగా ప్లే స్కూలులో చదువుకుంటున్నాడు. వీరు నాగరాజు తల్లిదండ్రులు సతీశ్ కుమార్, అంజమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. అదే ఇంట్లో నాగరాజు సోదరుడు జగదీష్, ఆయన భార్య మంజుల కూడా ఉంటున్నారు. అయితే తన కొడుకు కంటే కార్తీక్ వాసుపైనే మామ సతీశ్ ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారంటూ మంజుల తరుచూ గొడవలకు దిగేది. ఈ క్రమంలో ఆబాలుడిపై ద్వేషాన్ని పెంచుకొని, పలుమార్లు హత్యాయత్నం చేసింది. ఒకసారి బెడ్రూమ్‌లో బాలుడి ముక్కు, నోరు మూసి ఊపిరి ఆడకుండా చేయబోగా, తల్లి చూసి అడ్డుకుంది. మరోసారి భవనంపైకి తీసుకెళ్లి ప్రమాదకరంగా రేలింగ్‌పై కూర్చోబెట్టగా మామ గమనించి మందలించారు.కాగా ఈ నెల 9న రాత్రి 10 గంటల సమయంలో కార్తీక్ వాసు హాల్లో ఆడుకుంటుండగా, మంజుల అతడిని గదిలోకి పిలిచింది. చాక్లెట్ ఇస్తానని ఆశ చూపి, వంటిట్లోకి తీసుకెళ్లి జ్యూస్ అని నమ్మించి యాసిడ్ తాగించింది. అది తాగిన వెంటనే ఆ బాలుడు విలవిలలాడుతూ కేకలు వేయడంతో తల్లి సంధ్య పరుగున వచ్చింది. తొలుత నిందితురాలు బుకాయించినప్పటికీ, చిన్నారి కార్తీక్ జరిగిన విషయాన్ని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. వెంట నే బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. మూడ్రోజుల చికిత్స అనంతరం బాలుడు కోలుకోవడంతో మంగళవారం రాత్రి వాసు తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పదంగా మారిన పీవీఆర్ ఉద్యోగి మృతి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్తః
ఇర్రుంమంజిల్‌లోని గెలేరియా పీవీఆర్ మాల్‌లో పనిచేసే ఒక ఉద్యోగి మృతి వివాదస్పదంగా మారింది. న్యాయం కోసం కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో ఇక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. వివరాల్లోకి వెళితే.. గెలేరియా పీవీఆర్ మాల్‌లో హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ(45)కు గురువారం ఉదయం విధుల్లో ఉన్న సమయంలో ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో అసౌకర్యానికి గురైన ఆయన ఇంటికి వెళ్తానంటూ అక్కడున్న తన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందుకు వారు నిరాకరించడంతో నొప్పితోనే విధులు నిర్వర్తించిన సత్యనారాయణ కాసేపటికి ప్రొజక్టర్ ముందు ప్రాణాలు కోల్పోయాడు. అది గమనించిన యాజమాన్యం అతని మృతదేహాన్ని అక్కడి నుంచి తొలగించి రోడ్డు పుట్‌పాత్‌పై పడుకోపెట్టారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న సత్యనారాయణ కుటుంబ సభ్యులు జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. థియేటర్ యజమాన్యం కారణంగానే ప్రాణాలు కోల్పోయాడంటూ ఆందోళనకు దిగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పంజాగుట్ట పోలీసులు మృతదేహాన్ని శవపంచనామాకు తరలించేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో అదనపు డీసీపీ ఆనంద్, పంజాగుట్ట డివిజన్ ఏసీపీ పి. మురళీకృష్ణ, పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని మృతుడి భార్య కల్పన పోలీసులను కోరారు. గురువారం సాయంత్రం పొద్దుపోయే వరకు మృతదేహంతో ఆందోళన నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆందోళనలో సిఐటీయూ నగర కార్యదర్శి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ యాంకర్‌కి 'సోషల్ మీడియా'లో వేధింపులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్‌లోని ఒక టీవీ ఛానెల్‌లో పనిచేస్తున్న యాంకర్‌ను సోషల్ మీడియాలో వేధిస్తున్న అగంతకులపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని 3టీవీ కార్యాలయంలో ఒక యువతి(22) న్యూస్ యాంకర్‌గా పనిచేస్తుంది. ఆమెకు గురువారం బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఉద్యోగంలో చేరినందుకు బెదిరించడంతోపాటు ఉద్యోగంలో నుంచి తొలగిస్తామంటూ బెదిరించారు. అదే వ్యక్తి పలు వాట్సాప్ నంబర్ల నుండి ఇన్‌స్టా ఐడీ(అరుణ్ జాపుల448) నుంచి బెదిరింపులు, అసభ్య సందేశాలు పంపాడు. అంతేకాకుండా ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు పాల్పడటంతోపాటు, మార్ఫింగ్ చేసిన పొటోలను స్నేహితులకు, బంధువులకు పంపుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనంతటి వెనుక మాజీ ప్రియుడు వడ్డే హరీష్ కారణమై ఉంటాడని అనుమానిస్తూ ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం హుండీ లెక్కింపు

సంజీవరెడ్డి నగర్,
ఏప్రిల్ 16, ప్రభాతవార్త: ఎంతో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. జనవరి 28, 2026 నుంచి ఏప్రిల్ 16, 2026 వరకు మొత్తం 79 రోజుల కాలంలో 12 హుండీల ద్వారా రూ.92,34,711 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ లెక్కింపు కార్యక్రమం కే. వినోద్ (డీసీఈఓ), స్థాపక అధ్యక్షులు కే. సాయి బాబా గౌడ్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఎండోమెంట్స్ విభాగం సెకుం దరాబాద్ ఇన్స్పెక్టర్ పి. శ్రీదేవి, సూపరింటెండెంట్, సిబ్బంది, భక్తులు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్ఆర్ నగర్ బ్రాంచ్ అధికారుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించబడింది.అదేవిధంగా, హుండీలలో భక్తులు సమర్పించిన బంగారం, వెండి కానుకలను కూడా లెక్కించి నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆదాయం ఆలయ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు.

చేపల మార్కెట్ ప్రాంతంలో అక్రమాల తొలగింపు


అక్రమాలను తొలగించే విషయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏ.ఇ కలమ్మ

బేగంబజార్,ఏప్రిల్ 16ప్రభాతవార్త: బేగంబజార్ చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగారోడ్డుపై అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఇంజనీర్ కలమ్మ అన్నారు.బేగంబజార్ చేపల మార్కెట్ పరిసరాలో చేపలు అమ్మకాలు చేసే వారు ఏకంగా రహదారులపై అమ్మకాలు చేసి చెత్తాచెదారాన్ని వేయడం ద్వారా అపరిశుభ్రతగా మారుతుందన్నారు.గురువారంఅసిస్టెంట్ ఇంజనీర్ కలమ్మ ప్రగతి పాలనలో భాగంగా సానిటేషన్ సిబ్బంది,ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి ఆమె స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు.చేపల వ్యాపారం చేసుకునే వారికి భవనం కట్టించారని,అందులోనే అమ్మకాలు చేసుకోవాలని,రహదారిపై చేపల అమ్మకాలు చేయడం ద్వారా వాహనాదారులకు,పాదాచారులకు,అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు స్పెషల్ డ్రైవ్ చేయడం జరిగిందన్నారు.రహదారులపై వ్యాపారులపై కొంతమందికి చలాన్లు వేసినట్లు చెప్పారు.ఈకార్యక్రమంలోన జిహెచ్ఎంసి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉన్నారు.

మోడీ నిర్ణయంతో బిజెపి మహిళా నేతల సంబురాలు

స్వీట్లు పంచుకుంటూ సంబురాలు జరుపుకుంటున్న స్వరూపాగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:
నారీశక్తి వందన్ అధినియం దేశ చరిత్రలో ఒక కీలక మైలురాయని గతంలోనే కొత్త పార్లమెంట్ భవనంలో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చారని మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ అన్నారు. మోడీ నిర్ణయంతో వారాసిగూడలో మహిళలు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మహిళల రాజకీయ సాధికారతను మరింత బలపరచాలనే సంకల్పంతో, 2029 నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలనే సవరణను కూడా మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిందని దీనితో పాటు డీలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తీసుకు రావడం జరిగిందని స్వరూప గౌడ్ తెలిపారు.

సిబిఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతానాయర్.

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: సీబీఎస్ఈ ఫలితాల్లో పలు పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వంద శాతం ఫలితాలను సాధించింది. సవరం లక్ష్మీస్కంద 96.8 శాతం, అభిరాం సాయి లెల్ల 96.4 శాతం, నివేద మనోహరన్ 96.2 శాతం మార్కులు సాధించారు. 250 మంది విద్యార్థులలో 156 మంది 75 శాతంకుపైగా మార్కులను సాధించినట్లు జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మురళీ ముకుంద్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో 136 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 97.4 శాతంతో జశ్విత జంగమ, 97 శాతం మార్కులతో బుర్ర లలిత్‌కుమార్, ఎల్లంగారి జశ్వంత్, 96.8 శాతంతో రాజ్ హర్షిత్‌లు మార్కులు సాధించారు. 116 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతానాయర్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్(విద్యాశ్రమం) విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏఐలో 100 మంది విద్యా ర్థులు వంద మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అరుణశ్రీ తెలిపారు. చిత్రాక్ష్ 478 మార్కులు, శశాంక్ 477 మార్కులు, శ్రేయాషి, వినతి కోసూరిలు 473 మార్కులు సాధించినట్లు తెలిపారు.

తొలి దళిత సాహిత్య ఉద్యమ కవి దున్న ఇద్దాసు

-విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు

కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు అన్నారు.

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: సాహిత్యం,సంస్కృతిని, సామాజిక సమైక్యత కోసం కృషి చేసిన మహనీయులలో అగ్రగణ్యుడు దున్న ఇద్దాసు అని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు అన్నారు. గురువారం ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా తొలి దళిత కవి, తెలంగాణ వేమన దున్న ఇద్దాసు సంస్మరణ సభ త్యాగరాయ గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదిక లో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును మాదిగ మహాయోగిగా కీర్తించారని, సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య చరిత్ర రచయితలు ఇద్దాసును తొలి దళిత కవిగా గుర్తించారని అన్నారు. అచల యోగిగా, సంకీర్తనాకారుడిగా, తత్త్వకవిగా, ప్రసిద్ధుడైన దున్న ఇద్దాసు అట్టడుగు కులాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడు అని కీర్తించారు. కార్యక్రమంలో శ్రీపాద రేణుక , గాయని లక్ష్మీ శాంతి, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు

అంతర్జాతీయ గాన కళారత్న డాక్టర్ త్రినాథ్ రావు

...మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి

త్రినాథరావుకు ప్రపంచ రికార్డు పత్రాన్ని అందజేస్తున్న మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి. చిత్రంలో మనం ఫౌండేషన్ అధ్యక్షులు చక్రవర్తి తదితరులు.

చిక్కడపల్లి ఏప్రిల్ 16 (ప్రభాతవార్త) : ప్రముఖ గాయకుడు, అంతర్జాతీయ గాన కళారత్న డా. త్రినాధరావు సంగీత రంగంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించారు. ఇప్పటికే ఐదు ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకున్న ఆయన, తాజాగా గురువారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఈ పురస్కారాన్ని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా అందుకున్నారు. ఆరో ప్రపంచ రికార్డును కైవసం చేసుకున్నారు. గత ఏడాది జనవరి 1 నుంచి డిసెంబరు 31 వరకు రోజుకో పాట శీర్షికన విరామం లేకుండా 365 రోజుల పాటు 365 పాటలను ఆలపించి యూట్యూబ్ వేదికగా ప్రేక్షకులను అలరించారు. ఈ విశేష కృషిని గుర్తించిన అంతర్జాతీయ సంస్థ మనం ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రవర్తి రికార్డును ప్రకటించి రికార్డు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా త్రినాధరావు మాట్లాడుతూ ఈ గుర్తింపు తనపై బాధ్యతను మరింత పెంచిందని, సంగీత సేవలో మరిన్ని విజయాలు సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

19న భారత రాజ్యాంగంపై జాతీయ స్థాయి సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

సైఫాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: భారత రాజ్యాంగంపై ఈ నెల 19న కైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటి తెలిపింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సొసైటి అధ్యక్షుడు జి.మురళీధర్‌రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, కే ంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక వేళ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటే దేశ వ్యాప్తంగా ప్రజలతో చర్చించాలని డిమాండ్ చేశారు. 19న జరిగే సదస్సులో ముఖఅతిధిగా డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనియర్సిటి వైస్-ఛాన్సలర్ ఘంటా చక్రపాణి, గౌరవ అతిధులుగా మాజీ డిజి డా.జే.పూర్ణచంద్రరావు, విశ్రాంత న్యామమూర్తి నిమ్మ నారాయణ, సొసైటి సెక్రటరీ జనరల్ ఆర్.చంద్రశేఖర్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు.



అరైవ్ అలీవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం అశోక్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్‌లకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

పాతబస్తీ ఘాన్సీబజార్‌లో పశ్చిమ బెంగాలీ ఎన్నికల సందడి

-బిజెపి గెలుస్తుందా,టిఎంసి గెలుస్తుందా అన్న టెన్షన్‌లో బెంగాలీ ప్రజలు

-ఘాన్సీబజార్ డివిజన్ నుంచి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటు వేయటానికి వెళ్లిన వేలాది మంది ఓటర్లు

చార్మినార్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త : పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న పశ్చిమ బెంగాల్ సార్వత్రిక ఎన్నికల్లో తమఓటు హక్కును వినియోగించుకోవటానికి హైదరాబాద్ పాతబస్తీ నుంచి బెంగాలీలు వెళుతున్నారు.ఏప్రిల్ నెల 23,29 తేదీలలో పశ్చిమ బెంగాల్ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.ఘాన్సీ బజార్ డివిజన్‌లోని షక్కర్‌కోట, కోకరివాడి,మామాజుమ్లా పాఠక్,ఝులా,ఆనంద్‌గల్లీ, పెట్లాబుర్జు,చార్‌మహల్,హుస్సేనీఆలం,బిట్టికాషేర్,బండిఅడ్డ,చేలాపుర,గొల్లగల్లి,కిల్వత్,కసారట్టతో పాటు అత్తాపూర్,ఛత్రినాక,గౌలిపుర,ఉప్పుగూడ,మీరాలంమండి,దూద్‌బౌలి ప్రాంతాలలో వేలాది మంది బెంగాలీలు నివసిస్తున్నారు.తొంభై శాతం వరకు బెంగాలీలు బంగారు ఆభరణాలు తయారు చేసి బంగారం ఆభరణాల దుకాణాలకు ఆర్డర్లపై ఇస్తుంటారు.బంగారు ఆభరణాలు తయారు చేసే ప్రతి దుకాణంలో ఇరవై మంది వరకు కార్మికులు ఉన్నారు.ఘాన్సీ బజార్ డివిజన్‌లోని బెంగాలీలు బెంగాలీ ఎన్నికలపైనే చర్చించుకుంటున్నారు.కొద్ది రోజుల క్రితం ఘాన్సీ బజార్‌లోని మురళీధర్ మందిరంలో జరిగిన బెంగాలీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గ్రామీణ పాంతంలో ఉన్న మీబంధువులు,స్నేహితులకు ఫోన్ చేసి బిజెపికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్ధించారు.కాగా ఎఐఎంఐ ఎం తరుపున పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.ఎంఐఎం అధ్యక్షులు,ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పశ్చిమ బెంగాల్‌లో ఎంఐఎం తరుపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.పాతబస్తీలో పశ్చిమ బెంగాల్‌కుచెందిన హిందువులు,మైనార్టీలు ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడ స్థిర పడి ఉన్నారు.ఈ నెల 23,29 తేదీలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాటానికి ట్రైన్లు,వాహనాలలో బెంగాలీ ప్రజలు తరలి వెళుతున్నారు.పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి గెలుస్తుందని,మరి కొందరు బిజెపి గెలుస్తుందని చర్చించుకుంటున్నారు. బెంగాలీ ప్రజలు ఓటు వేయటానికి తరలి వెళ్తుండటంతో ఘాన్సీ బజార్ డివిజన్‌లోని ప్రాంతాలు నిర్మాణుష్యంగా కనిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి గెలుస్తుందా, బిజెపి గెలుస్తుందా అన్న టెన్షన్‌లో బెంగాలీ ప్రజలు ఉన్నారు.

ఆర్టిజన్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి : కార్తీక్ రెడ్డి

అత్తాపూర్ ఏప్రిల్ 16,ప్రభాతవార్త : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఆర్టిజన్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. గురువారం రాజేంద్రనగర్ ,శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరుగుతున్న ధర్నాలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొని ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే ఆర్టిజన్ల డిమాండ్ న్యాయమైనదని పేర్కొన్నారు. ఆరు ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం వారు చేస్తున్న పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏళ్ల తరబడి విద్యుత్ సంస్థలో సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కాటేదన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ , అర్చన జైప్రకాష్ , శాస్త్రీపురం విజన్ అధ్యక్షులు ముక్రం ఖాన్ , సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షులు జహీర్ ఖాన్ , హైమద్ పటేల్ , మైలర్ దేవ్ పల్లి డివిజన్ యూత్ అధ్యక్షులు అక్కెం రాఘవేందర్ యాదవ్ , కొంపల్లి జగదీష్ , ఎడ్లకడి సూర్యం , జె సునీల్ , రామకృష్ణ , అశోక్ కుమార్ , అరుణ్ ముదిరాజ్ , కృష్ణ ముదిరాజ్ , రిషి , హర్షత్ , బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ల నిరసనకు మద్దతు తెలిపిన తోకల శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శివరాం పల్లిలో గత 9రోజులుగా విద్యుత్ విభాగంలో పని చేస్తున్న ఆర్టిసన్ కార్మికులు తమని రెగ్యులైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న సమ్మెలో బిజెపి తరఫున సంఘీభావం తెలుపుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్ని ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్ర నగర్ సర్కిల్ జెఏసి సభ్యులు కే రాజు ,ఎన్ స్వామి చైర్మన్ కన్వీనర్ డివిజన్ బాడీ సభ్యులు కాజా పాషా, సీతారాం నాయక్ ,మహమ్మద్ జాంగిర్ ,రాములు ,నాగేశ్వరరావు ,వెంకటరమణ , జనార్దన్ ,బొమ్మరాజు, నరసింహ ,వెంకటరమణ మధుసూదన్ రెడ్డి ,శంకర్ రెడ్డి ,మరియు యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట

- రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్

- ముదిరాజ్‌లను బిసిడి నుంచి బిసిఎలోకి మార్చాలని విన్నపం

కోకాపేట్‌లోని ముదిరాజ్ ఆత్మగౌరవ భవన స్థలంలో మహాత్మా జ్యోతిబాపూలే, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నార్సింగి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : ముదిరాజ్‌ల సంక్షేమాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కోకాపేట్‌లోని రాష్ట్ర ముదిరాజ్ ఆత్మగౌరవ భవనం వద్ద మహాత్మా జ్యోతిబా పూలే, కాంగ్రెస్ అధ్యక్షులు రాహూల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి పని చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముదిరాజ్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ముదిరాజ్‌లదేనని కుల గణన ద్వారా తేలిందని, ఈ విషయంను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం గర్వంగా ఉందన్నారు. ముదిరాజ్‌లు నేటికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో వెనుకబడే ఉన్నారని, వారి ఎదుగుదలకు బిసిడి నుంచి బిసిఎలోకి మార్చాలని, ఈ ప్రకటన త్వరలోనే ప్రభుత్వ పెద్దలు వెల్లడిస్తారన్న ఆశాభావంను జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వెల్లడించారు. కుల గణన వివరాలు ప్రకటించేలా పిసిసి అధ్యక్షులు మహేష్‌గౌడ్, మంత్రులు శ్రీహరి, పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు చొరవ తీసుకున్నారని తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే, అంబేద్కర్‌లు చూపిన సమానత్వం, సామాజిక న్యాయం మార్గాన్ని అనుసరిస్తూ, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌ల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకొని తొలిసారిగా ముదిరాజ్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి, తొలి చైర్మన్‌గా నాకు బాధ్యతలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఋణపడి ఉంటానని తెలిపారు. ముదిరాజ్‌ల ఐక్యత, అభివృద్ధి కోసం అహర్నిషలు కష్టపడుతున్నామని చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు వెంకటేష్, జగన్మోహన్, మల్లేష్, శంకర్, మోహన్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



మహబూబియా స్కూల్లో విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గన్‌ఫౌండ్రి,ఏప్రిల్ 16ప్రభాతవార్త: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలనిట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు.గురువారం గన్‌ఫౌండ్రిలోని ప్రభుత్వ బాలిక హైస్కూల్‌లోఆరైవ్-అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించాలని సూచించారు. వాహనదారులు, బాటసారులు రోడ్డు భద్రతా నియామాలను పాటించే డెమో ద్వారా పాఠశాలవిద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు...

ఆరైవ్-అలైవ్ ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా 3వ,4వ రోజు గోషామహల్ ట్రాఫిక్‌పోలీసులు నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో ఆటో,ట్రక్కు,బస్సు డ్రైవర్ల కోసం ప్రత్యేక కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గోషామహల్ ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో,మ్యాక్స్,విజన్ ఆసుపత్రి సమన్వయంతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు.ఈశిబిరంలో 150మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు.ట్రాఫిక్ పోలీసు కమీషనర్ జోయల్ డేవిస్ నేతృత్వంలో ఈ వైద్యశిబి రాన్ని ట్రాఫిక్ డిసిపి కాజల్‌సింగ్ పర్యవేక్షించారు .ఈకా ర్యక్రమంలో అదనపుట్రాఫిక్ డిసిపి వేణుగోపాల్‌రెడ్డి, ఎసిపి ధనలక్ష్మి,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు,కె.ఎన్. ప్రసాద్ వర్మ, ఆసిఫ్‌నగర్,కుల్సుంపురా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కులో ఉచిత వైద్య శిబిరం

చిక్కడపల్లి , ఏప్రిల్ 16 : వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య , దంత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికోవర్ ఆసుపత్రి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం నడకతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ కె. రవి రాజు, ఏరియా3 ఏవీపీ మురళి కృష్ణ, పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ నాగభూషణం, పూర్వ పాస్ట్ ఏవీపీ సంపత్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు ఎస్. రమేష్ రెడ్డి, ఎ. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

అత్తాపూర్ ఏప్రిల్ 16,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ,లైసెన్స్ వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదని రాజేంద్ర నగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ రాజు పేర్కొన్నారు.అరైవ్ అలైవ్" ప్రచారంలో భాగంగా బుద్వేల్‌లో వాటర్ ట్యాంకర్ డ్రైవర్లు ,ఆరాంఘర్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్ల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు.నిర్లక్ష్యంపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయని చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ , ఇన్సూరెన్స్ పత్రాలను తప్పకుండా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించనప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలుతామని పేర్కొన్నారు.అనంతరం కంటి క్లినిక్‌లో డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది డా.మొహమ్మదా అబ్దుల్ సైఫ్ ,తదితరులు పాల్గొన్నారు.

తమిళ భాష, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలి

-తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్

తమిళ పాఠ్యపుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్, కీస్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ గీత

చిక్కడపల్లి ఏప్రిల్ 16,ప్రభాతవార్త : తమిళ భాష, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలని తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్, కీస్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ గీత అన్నారు. గురువారం తమిళ నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ తమిళ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కీస్ గర్ల్స్ హైస్కూల్‌లో తమిళ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. తమిళ భాష, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డాక్టర్ గీత , ఎం కె .బోస్ ప్రారంభించి ప్రసంగించారు. డాక్టర్ గీత మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో భాషల ప్రాధాన్యం మరింత పెరిగిందని, మాతృ భాషతో పాటు ఇతర భారతీయ భాషలను నేర్చుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగకరమన్నారు. సంఘం అధ్యక్షుడు ఎం.కె. బోస్ మాట్లాడుతూ తెలంగాణలో కూడా తమిళ భాషాభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. తమిళ భాషకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని,. తెలంగాణ తమిళ సంఘం ఎప్పటి నుంచీ తమిళ భాషా పరిరక్షణకు కృషి చేస్తోంది. ఉపాధ్యక్షుడు ధర్మశీలన్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం నిర్వహించే ఈ తరగతులు క్రమబద్ధంగా కొనసాగుతాయి. తమిళేతరులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కోఆర్డినేటర్ రాజన్ ముత్తుస్వామి , విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బియ్యంలో తొలి తమిళ అక్షరం వ్రాసి విద్యాభ్యాసాన్ని ప్రారంభించి తమిళ పాఠ్యపుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి ఎస్. రాజ్‌కుమార్, ఖజాంచీ నెహ్రూ, సలహా మండలి సభ్యుడు డాక్టర్ మురళీధరన్, కార్యవర్గ సభ్యులు జగతీశన్, వాసన్, సారవణన్, జయప్రకాశ్, దురైసామి, మీనాక్షిసుందరం, శ్రీనివాసన్, అలాగే క్లాస్ కోఆర్డినేటర్లు కుమారరాజన్, రాజన్ ముత్తుస్వామి, సారవణకుమార్, ఉపాధ్యాయులు అరుణాదేవి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు ఇవోలుగా మహిళలను నియమించాలి

సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

సైఫాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: వేదాలు, అచారాలు, సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణ సమాజం శతాబ్దాలుగా కీలక పాత్రను పోషిస్తున్న నేపధ్యంలో దేవాలయాల పరిపాలనలో, ఆధ్యాత్మిక అవగాహన కలిగిన బ్రాహ్మణ మహిళలను కార్యనిర్వాహణాధికారులుగా నియమించాలని గ్లోబల్ బ్రాహ్మణన్స్‌వెల్ఫేర్ ఆసోసియేషన వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిప్రసాద్‌శర్మ ప్రభుత్వాని కోరారు. బ్రాహ్మణులు దేవాలయాలకు మాత్రమే పరిమితం కాదని, భారతదేశానికే పేటెంట్లు, దేశాన్ని కాపాడుకునే అంశంలో ప్రధాన పాత్ర బ్రాహ్మణులదేనని ఆయన స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేదాంతి పాండేతోకలిసి ఆయన మాట్లాడుతూ మతం మారిన బ్రాహ్మణులతో సంబంధం లేదన్నారు. ఇటీవల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ బ్రాహ్మణ సమాజంపై చేసిన వ్యాఖ్యలలో కొన్ని అపార్థాలు, అవగాహన లోపాలు ఉన్నాయని, వీటిపైన చర్చించేందుకు బ్రాహ్మణ భవన్‌కు రావాలని తాము ఆహ్వానించామని, కాని ఆయన పని వత్తిడి కారణంగా రాలేకపోతున్నామని సమాచారం అందించారని చెప్పారు. అసలు కృష్ణమాదిగ మాదిగల కోసం పనిచేస్తున్నారా? లేక క్రైస్తవుల కోసం పనిచేస్తున్నారన్న విషయాని న్ స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాదిగల హక్కులు, వారి సంక్షేమం, భవిష్యత్తు కోసం సరైన మాదిగ మేధావులు ముందుకు రావాలని కోరారు. కులం, మతం గురించి అవగాహన లేని భైరీ నరేష్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, మంద కృష్ణమాదిగ వారి, వారి కులాలకు ఎం చేశారని ఆయన ప్రశ్నించారు. రాబోయే రెండేళ్లలో దేవాలయాలకు ఇవొలుగా బ్రాహ్మణులే ఉండేలా చట్టం తీసుకువస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

జాతీయ పదవులు వరించిన నేతలకు సత్కారం

నన్నూరి నర్సిరెడ్డి, బక్కిన నర్సింహులును సన్మానిస్తున్న మల్లికార్జుననాయుడు, విజయశ్రీ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీలో జాతీయ పదవులు లభించిన టిటిడి కమిటీ సభ్యుడు నన్నూరి నర్సి రెడ్డి, పార్టీ సీనియర్ నేత బక్కి నరసింహులును తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలు గురువారం ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు మల్లికార్జున నాయుడు, చిట్టినేని విజయశ్రీలు వారిని సత్కరించారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు.

ఎస్పీఆర్‌హిల్స్ క్రీడా మైదానాన్ని కాపాడుకుంటాం

సమావేశంలో మాట్లాడుతున్న సునీతగోపీనాథ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఎంతో కష్టపడి యువత కోసం రూపుదిద్దిన క్రీడా మైదానాన్ని కాపాడుకుంటామని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ మాగంటి సునీతగోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ హిల్స్ క్రీడా మైదానం యథాతథంగా క్రీడల కోసం కొనసాగించాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రహ్మత్‌నగర్ డివిజన్ నేతలతో కలిసి ఆమె మాట్లాడుతూ యువత, స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ మైదానాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లో మాగంటి హయాంలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రజలకు తక్షణమే అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. మాగంటి కృషితోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమైందన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మాగంటి సునీతగోపీనాథ్ కోరారు. కేటీఆర్ నాయకత్వంలో దివంగత మాగంటి గోపినాథ్ ఆశయాలను కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్తామని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు చోటు, నాగరాజు, వజీద్, బషీర్, నజీర్, వసీం బేగం, అర్బాత్, గోపిచంద్, గఫ్పూర్, బషీర్, ప్రసాద్, సాయి, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధంగా డివిజన్ల పునర్విభజన : బిజెపి



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : మూడు కార్పొరేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన 300 డివిజన్లు అసంబద్ధంగా, ప్రధానంగా మల్కాజిగిరి, సైబరాబాద్ పరిధిలో ఏర్పాటు చేసిన డివిజన్లు ఒక పార్టీకి అనుకూలంగా ఉన్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్ ఆరోపించారు. ఈ విషయమై తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. సుల్తాన్‌షాహి గంగపుత్ర సంఘంలో నిర్వహించిన సమవేశంలో ఆయన మాట్లాడుతూ సమాన జనాభా ప్రమాణాలను పాటిస్తూ న్యాయమైన విధంగా డివిజన్లను పునర్విభజించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న మొఘల్‌పురా డివిజన్‌ను హరిబౌలి డివిజన్‌గా మార్చిన నేపథ్యంలో కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గోల్కొండ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సురేందర్, కార్యదర్శి శైలజ, నేతలు ఎం.కుమార్, శ్రీనివాస్, సిద్దేశ్వర్ సింగ్ రాణా, ప్రకాశ్, దినేష్, చేతన్ కుమార్ సూరి, పద్మ, వీరమణి, దేవి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కైతలాపూర్ డంపింగ్ యార్డ్‌లో గుర్తుతెలియని మృతదేహం

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కైతలాపూర్ డంపింగ్ యార్డ్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనది. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కైతలాపూర్ డంపింగ్ యార్డ్ దగ్గర ఉందని స్థానికులు పెట్రోల్ మొబైల్‌కు డయల్ 100 ద్వారా నరసింహ అనే వ్యక్తి ఫోన్ చేయగా వెంటనే పెట్రోల్ మొబైల్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి డంపింగ్ యార్డ్ దగ్గరలో చెత్తకుప్పల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 45 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి మృతదేహం కుళ్ళిపోయి ముఖంపై శరీరంపై పురుగులు పాకుతున్న స్థితిలో కనిపించింది. ఈ మేరకు మృతదేహన్ని కూకట్‌పల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసును పోలీసులు నమోదు చేసుకునే దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం..

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త గాజులరామారం ప్రాంతానికి చెందిన విద్యార్థి అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాజులరామారం నివాసి మచినేని సురేష్ (20), శివ శివాని కాలేజీలో డిగ్రీ బీబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు.ఈ నెల 16వ తేదీన సురేష్‌కు పరీక్ష ఉండడంతో ఉదయం కాలేజీకి వెళ్లి పరీక్ష రాసిన అనంతరం ఉదయం 11:45 గంటల సమయంలో కాలేజీ నుండి బయటకు వచ్చాడు. అనంతరం తన హాస్టల్ గదికి చేరుకుని దుస్తులు మార్చుకుని, ఒక బ్యాగ్‌లో తనకు అవసరమైన వస్తువులు సర్దుకొని, తన స్నేహితుడి మొబైల్ ఫోన్ తీసుకుని బయటకు వెళ్లినట్లు సమాచారం.అయితే ఆ తర్వాత నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారణ జరిపినా సురేష్ ఆచూకీ లభించలేదు.దీంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సురేష్ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

పెళ్లిపేరుతో నమ్మించి మోసం

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త: సాఫ్ట్‌వేర్ ఉద్యోగినైన తనను ట్రాప్ చేసి పెళ్లి చేసుకుని ఆతర్వాత తనను మోసం చేశాడని ఓయువకుడిపై కూకట్‌పల్లికి చెందిన బాధిత సాఫ్ట్‌వేర్‌ఉద్యోగిని సంచనల ఆరోపణలు చేసింది. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి తన బాధలను వెళ్లగక్కింది. ఏపీకి చెందిన వ్యక్తి గతేడాది నన్ను ప్రేమ పేరుతో మోసగించి పెళ్లి చేసుకున్నాడని ఆ తర్వాతే అతడి అసలు రూపం బయటికి వచ్చిందని తెలిపింది. ఆ వ్యక్తి తనను పెళ్లి చేసుకుని.. అతడి సోదరులతో అత్యాచారం చేయించాడని వాపోయింది. నెల్లూరుకు చెందిన ఆయువకుడు గతేడాది మే నెలలో కూకట్‌పల్లిలో ట్రేడింగ్, ఫుడ్ బిజినెస్ పేరుతో పరిచయం అయ్యాడని భవిష్యత్తులో దుబాయ్ వెళ్లిపోదామని మాయ మాటలు చెబితే గతేడాది జూలైలో తాము ఇద్దరం పెళ్లి చేసుకున్నట్లు పేర్కొంది. అయితే అప్పటికే 2 పెళ్లిళ్లు అయినట్లు తనకు అక్టోబర్ నెలలో తెలిసిందని బాధితురాలు వెల్లడించింది. ఈ క్రమంలోనే తనను బెదిరించడం మొదలు పెట్టాడని.. తనకు మత్తు మందు ఇచ్చి బేగంపేట్ రిసార్టులో అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా.. అతడి తమ్ముళ్లఓ సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు తెలిపింది. ఇక తనపై అత్యాచారం చేసిన సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి.. వాటిని అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేశాడని ఈ విషయం ఎవరికైనా చెబితే తన తల్లి, చెల్లెల్లను హతమార్చుతానని బెదిరించినట్లు యువతి వాపోయింది. తన పేరు మీద లోన్లు తీసుకున్నాడని.. అంతేకాకుండా తన బంగారాన్ని కూడా కుదువపెట్టి డబ్బులు తీసుకున్నట్లు చెప్పింది. శంషాబాద్‌లో ఉన్న ఒక ఫ్లాట్‌ను కూడా అమ్మేశాడని తెలిపింది.అతని దారుణాలు తట్టుకోలేక తాను కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడు హైదరాబాద్ నుంచి నెల్లూరుకు పారిపోయినట్లు చెప్పింది. పైగా అతడు ఏ తప్పు చేయలేదని.. తానే అతడిని ట్రాప్ చేసినట్లు ఈ కేసును తప్పుదోవ పట్టించేలా ఒక వీడియోను కూడా విడుదల చేశాడని జరిగిన విషయం మొత్తం అందరికీ తెలియాలనే తాను ఇప్పుడు మీడియా ముందుకు వచ్చినట్లు బాధితురాలు స్పష్టం చేసింది.తనకు జరిగిన అన్యాయం మరే యువతికీ జరగకూడదనే ఉద్దేశంతోనే ఇప్పుడు ధైర్యంగా బయటికి వచ్చి ఈ విషయాలన్నీ చెబుతున్నానని బాధితురాలు వెల్లడించింది.

మెరుగైన వైద్యానికి ఎల్ఓసీ : ఎమ్మెల్యే శ్రీగణేష్

వైద్య చికిత్సకోసం రూ.2 లక్షల ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: కార్పోరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందకు పేద ప్రజలు ముఖ్యమంత్రి సహాయ నిధి సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. గురువారం బొల్లారం చింతల్ బజార్ ప్రాంతానికి చెందిన మనోహర్ కుమారుడు కార్తీక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్ అసుపత్రిలో వైద్యం చేయించుకునేందకు మంజూరైన రూ. 2 లక్షల ఎల్ఓసీని గురువారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్తీక్‌కు అందజేశారు.

బాలింతలకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలి : తలసాని

అంగన్ వాడి టీచర్లకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: అంగన్ వాడి టీచర్లు పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నియోజకవర్గంలోని 22 అంగన్ వాడీ కేంద్రాల టీచర్లకు గురువారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఎమ్మెల్యే తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం పంపిణీ వివరాలను ఆ న్‌లైన్‌లో నమోదు చేయడం కోసం సెల్‌ఫోన్లను అంగన్ వాడి కేంద్రాలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ స్వప్న, సూపర్ వైజర్లు జాహ్నవి, హరిప్రియలతో పాటు అంగన్ వాడి టీచర్లు పాల్గొన్నారు.

సాయిసంకల్ప కాలనీలో మాజీ సర్పంచ్ పర్యటన

కాలనీ వాసులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ కావలి గణేష్

దుండిగల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్ 296 డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామంలోని సాయిసంకల్ప కాలనీలో మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఆకుల ప్రేమ్ పటేల్‌తో కలిసి గురువారం పర్యటించారు.కాలనీలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యలను పరిశీలిస్తూ గల్లీ గల్లీకి తిరిగి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా త్వరలోనే సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, ఎల్లయ్య గౌడ్, ఆకుల ప్రకాష్, ఆకుల నరేష్, అలీ భాయ్ సుదీప్ సింగ్, అజయ్, కాలనీ నాయకులు వాసులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో దోమల ఉధృతి

అధికారుల నిర్లక్ష్యంపై నగేష్ ముదిరాజ్ ఆగ్రహం

నిజాంపేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ప్రగతినగర్ కాలనీలో గత కొద్ది రోజులుగా దోమల ఉధృతి తీవ్రంగా పెరిగిపోయిందని, సాయంత్రం ఆరు గంటల తర్వాత ప్రజలు బయటకు రావడానికే భయపడే పరిస్థితి ఏర్పడిందని తెలుగుదేశం పార్టీ నాయకులు నగేష్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మలేరియా, డెంగ్యూ వంటి వైరల్ జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ ప్రాంతం, పారిశుద్ధ్య చర్యల వల్ల కొంతకాలం మెరుగుపడినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ పాత పరిస్థితులు తిరిగి వస్తున్నాయని ఆయన మండిపడ్డారు.అధికారులు సమస్యలను గమనిస్తున్నప్పటికీ స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. దోమల కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున, వెంటనే ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అధికారంలో ఉన్న నాయకులు మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని ఆయన సూచించారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వం, అధికారుల బాధ్యత అని, ప్రగతినగర్ కాలనీ వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని నగేష్ ముదిరాజ్ హెచ్చరించారు.

రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

-కార్యక్రమానికి హాజరైన కూన శ్రీశైలం గౌడ్

వేం నరేందర్ రెడ్డిని కలిసిన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై, కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన వేం నరేందర్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన వేం నరేందర్ రెడ్డి పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల సమస్యలను మరింత బలంగా ప్రస్తావించి, రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకుడు బొమ్మ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపును వేగవంతం చేయండి



అల్వాల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: గుర్రపు డెక్కను సాధ్యమైనంత త్వరగా తొలగించాలని అధికారులను అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం అధికార యంత్రాంగంతో కలిసి చినరాయుని చెరువు గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. గుర్రపు డెక్క కారణంగా చెరువులో దోమలు విపరీతంగా ఉన్నాయని తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని మాజీ కార్పొరేటర్ పేర్కొన్నారు. పలు సమస్యలకు సంబంధించి స్థానికులు ఆమె దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎంటమాలజీ విభాగానికి చెందిన బాలాజీ పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా మహనీయుల జయంతి

మహనీయులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి, బీసీ సెల్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి వేడుకలను గురువారం విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య సూర్య ధనుంజయ్ హాజరై ప్రసంగించారు. మహనీయులు సమాజంలో సమానత్వం, న్యాయం, విద్యాభివృద్ధి కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి రావాలని, ముఖ్యంగా మహిళా సాధికారత, విద్యా విస్తరణలో వారి ఆలోచనలు ఎంతో ప్రేరణనిస్తాయని తెలిపారు.సభాధ్యక్షులుగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు మాట్లాడుతూ, మహానుభావుల జీవితాలు త్యాగం, సేవ, ధైర్యానికి ప్రతీకలని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి వారు చేసిన పోరాటం నేటికీ మార్గదర్శకమని అన్నారు. విద్యార్థులు వారి జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.విశిష్ట అతిథి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు మాట్లాడుతూ, పరిపాలనలోనూ, సమాజ నిర్మాణంలోనూ మహానుభావుల సిద్ధాంతాలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవని తెలిపారు. సామాజిక న్యాయం, పారదర్శకత, సమాన అవకాశాలు ప్రతి పౌరుడు పాటించాల్సిన విలువలని పేర్కొన్నారు. జీవిత లక్ష్యంపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు హితవు పలికారు.రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ, మహనీయుల ఆలోచనలు పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ చేరాలని అన్నారు. యువతలో విలువలు, సేవాభావం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగకరమని పేర్కొన్నారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అకాడమిక్ కౌన్సిలర్ పొనుగోటి కృపాకర్, అధ్యాపకులు గుడిపాటి రవి తదితరులు కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌సి, ఎస్‌టి సెల్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్ పాల్ పాత్లోత్ సమన్వయపరిచారు.కార్యక్రమం ప్రారంభంలో అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పులే చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.తదనంతరం ప్రేరణాత్మక వక్త ప్రదీప్ కొండిపర్తి ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అనే అంశంపై ప్రసంగిస్తూ, సరైన వైఖరి, నైపుణ్యం, పరిజ్ఞానం ఉంటే ఎవరికైనా విజయాన్ని సాధించడం సాధ్యమని యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు.

సగర భగీరథ మహర్షి జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీసగర భగీరథ మహర్షి జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్,సగర సంఘం నాయకులు

శేరిలింగంపల్లి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

తెలంగాణప్రభుత్వం ఈనెల 23వ తేదిన అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సగర సంఘం రాష్ట్ర నేతల సమక్షంలో అవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సర్వజీవులకు ప్రాణాధారమైన గంగను ఒంటికాలిపై కఠోరమైన తపస్సుతో దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహర్షి భగీరథుడని అన్నారు. ఆ మహనీయుని జయంతి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఈనెల 23వ తేదిన నిర్వహించే జయంతి ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు, గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవిసగర,గ్రేటర్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రంశెట్టి సీతారాం సగర, అంజయ్య నగర్ సగర సంఘం అధ్యక్షులు దిండి చెన్నయ్య, అంజయ్యనగర్ సగర సంఘం ఉపాధ్యక్షులు దిండి తిరుపతయ్య సగర, హఫీజ్‌పేట్ సంఘం గౌరవ అధ్యక్షులు సాయిబాబా,సంఘం నాయకులు విద్యాసాగర్, కిశోర్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి : సౌందర్య

అడ్డగుట్టలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న గాజుల సౌందర్య

అడ్డగుట్ట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: బస్తీలు,కాలనీ పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని అడ్డగుట్ట డివిజన్ బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం అడ్డగుట్టలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో సత్కరించి సమాజానికి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సాయన్న, శివలింగం, హంసరాజ్, రమేష్, గంగారామ్, ప్రసాద్, నాగరాజు, రాములమ్మ,కళ్యాణి, లక్ష్మి,గీత తదితరులు పాల్గొన్నారు.

సుచిత్ర సర్కిల్‌లో చలివేంద్రం ప్రారంభం

జీడిమెట్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో ప్రజల దాహాన్ని తీర్చాలన్న లక్ష్యంతో సుచిత్ర సర్కిల్‌లో చలివేంద్రాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యమకారుడు, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు జాలిగం రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్ఎల్ఎన్ గ్రూప్ చైర్మన్ కిరణ్మయిలు హాజరై తమ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న ఈ సమయంలో చలివేంద్రాల ఏర్పాటు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఎస్ఎల్ఎన్ గ్రూప్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దళితరత్న అవార్డుకు ఎంపికైన వారికి సన్మానం

దళిత రత్న అవార్డుతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

కంటోన్మెంట్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దళిత జాతి అభ్యున్నతికి, దళితుల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసిందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా పలువురికి దళిత రత్న అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. సంఘంలో సీనియర్ నాయకులు గోపి, నిమ్మ నాగలక్ష్మి, వివేక్, ఉదయ్, జీ, సంపత్, లడ్డు తదితరులకు ఎమ్మెల్యే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దళిత రత్న అవార్డులను అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కమిటీ కో చైర్మన్ ఎస్‌సీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.. సుదర్శన్ బాబు, రాపాక అశోక్, దేశపాక గోవర్ధన్, మిద్దె లింగం, ఎర్ర విజయ్ శంకర్, త్రిషులు శ్రీకాంత్, కే.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానం పంచినపుడే పెరుగుతుంది

దాతలందించిన పుస్తకాలను ప్రదర్శిస్తున్న సిటీ కళాశాల ఆచార్యులు

చార్మినార్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : జ్ఞానం పంచినప్పుడే పెరుగుతుందని ఆచార్య ప్రసాద్ అన్నారు.ప్రభుత్వ సిటీ కళాశాలలో 'పుస్తకం బహుకరించండి...భవిష్యత్తుకు తోడ్పాటు అందించండి' అన్న ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జ్ఞానం ఒక అద్భుతమైన సంపదని, సాధారణ సంపదను పంచుకుంటే తగ్గిపోతుంది, కానీ జ్ఞానాన్ని పంచుకుంటే అది వృద్ధి చెందుతుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విలువైన పుస్తకాలు అందించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో గిఫ్ట్ ఎ బుక్...గిఫ్ట్ ఎ ఫ్యూచర్ నిర్వహించటం అభినందనీయమన్నారు. జ్ఞానం యొక్క శాశ్వత సత్యాన్ని నొక్కి చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూత నిచ్చి, జ్ఞాన మార్పిడిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డా.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి, డా.నీరజ, డా.కోయ కోటేశ్వరరావు, కేథరిన్, కమల సుధారాణి, భాస్కర్, తిరుపతి, శంకర్, మల్లిక, సుదక్షిణ, శ్రీనివాస్, కృష్ణవేణి, లక్ష్మణ్ గౌడ్, ఆది రమేష్, జేవిఎన్ మల్లికార్జున్, కృష్ణ కీర్తి, శారద, నాగరాజు, విప్లవ దత్ శుక్లా, రతన్ కుమార్, అనసూయ, తబుసుం ఫాతిమా, కార్తీక్, బాలేష్ పాల్గొన్నారు.

నారీ శక్తి బిల్లు అమలుపై బిజెపి ధీమా

దుండిగల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : 2023లో పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, 2029 ఎన్నికల నాటికి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరా చారి తెలిపారు. దశాబ్దాలుగా ఇతర పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం విస్మరించిన మహిళా రిజర్వేషన్లకు తమ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించిందన్నారు.లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుండి 815-850 వరకు పెంచే ప్రతిపాదన ద్వారా పురుషుల ప్రాతినిధ్యం తగ్గకుండా, మహిళలకు సుమారు 272-273 స్థానాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఏ రాష్ట్రానికీ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగద ని, ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా భరోసా ఇచ్చారని చెప్పారు. నారీ శక్తి అనేది కేవలం రాజకీయ పరిమితి కాకుండా మహిళల సమగ్ర అభివృద్ధి లక్ష్యమని చారి పేర్కొన్నారు. ఉజ్వల, ముద్రా యోజన, లక్షపతి దీదీ వంటి పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. దేశం అమృత కాలంలో మహిళలు కీలక భాగస్వాములవ్వాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.అయితే, బిల్లుకు మద్దతు ఇస్తున్నామని చెప్పుకుంటూనే అమలు ప్రక్రియలో సాంకేతిక కారణాలను చూపుతూ ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయక త్వంలో భారతదేశం నారీ శక్తి ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఈ బిల్లు ఆ దిశగా అతిపెద్ద ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు.

హాస్టల్ విద్యార్థులకు పండ్లు పంపిణీ

కార్వాన్,ఏప్రిల్16,ప్రభాతవార్త : జియాగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ తన పుట్టిన రోజును లంగర్ హౌస్ లోని ప్రభుత్వ షెడ్యూల్ కాస్ట్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ భోజనం చేశారు.ఈ సందర్భముగా విద్యార్థులు విద్యలో మెరుగ్గా రాణించాలని కోరుకున్నారు.కార్వాన్ పన్నీపుర ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు,రోగులకు పండ్లు పంపిణీ చేసి,నవజాత శిశువులకు శుభాకాంక్షలు తెలిపారు.మిత్ర కృష్ణ మాట్లాడుతూ ...నాయకులు పుట్టిన రోజు వంటి కార్యక్రమాలను సమాజ సేవలో భాగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మిత్ర అభిషేక్,స్థానిక నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు జరిపించుకోవాలి : ఏసిపి చంద్రకుమార్

ఆటోడ్రైవర్‌కు కంటి పరీక్షలు జరిపిస్తున్న ఏసీపీ చంద్రకుమార్, ఇన్‌స్పెక్టర్లు దాసు, గోపీలు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : ప్రతి వాహన డ్రైవర్ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు జరిపించుకోవాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చాంద్రాయణగుట్ట జోన్ ట్రాఫిక్ ఏసీపీ వి.చంద్రకుమార్ అన్నారు. అరైవ్-అలైవ్ ట్రాఫిక్ అవగాహనలో భాగంగా గురువారం చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆటో, కారు, లారీ, భారీ వాహనాల డ్రైవర్లకు కేశవగిరి సల్వా అల్ వాలీద్ ఐ క్లీనిక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రకుమార్ మాట్లాడుతూ డ్రైవర్ల దృష్టిని మెరుగుపరచడం, రహదారి భద్రతను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రజల ప్రయోజనం, సురక్షితమైన డ్రైవింగ్ నిర్ధారించటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. వివిధ రకాల వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి పరీక్షల కోసం ముందుకు వచ్చినందకు వారిని అభినందించారు. పరీక్షలు జరిపించుకున్న డ్రైవర్లలో కొంత మందికి కంటి సంబంధిత లోపాలు గుర్తించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. మెరుగైన దృష్టిని పొందేందుకు అవసరమైన కంటి అద్దాలను సిఫార్సు చేశారు. దాతల సహకారంతో కళ్లద్దాలను అందజేశారు. భవిష్యత్‌లో దృష్టిలోపం రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారదార్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కె.రాంబాబు, లేనిన్ చారి, నౌషాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తనికెళ్ళ భరణి ఆలోచనలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయి : విశ్రాంత న్యాయమూర్తి రాధారాణి

సినీ నటులు డాక్టర్ తనికెళ్ళ భరణి..దుర్గాభవాని దంపతులలను రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 16 (ప్రభాతవార్త) : సంఘసంస్కరణకు ప్రతీకగా నిలిచిన కందుకూరి వీరేశలింగం, సాహిత్య, సినీ రంగాల్లో ప్రత్యేక ముద్ర వేసిన తనికెళ్ళ భరణి ఆలోచనలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు.గురువారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులుగారి 178వ జయంతి, తెలుగు రంగస్థల దినోత్సవం వంశీ ఆర్ట్ థియేటర్స్ నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు నేతృత్వంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగింది. ప్రముఖ బహుముఖ ప్రజ్ఞాశాలి, సినీ నటులు డాక్టర్ తనికెళ్ళ భరణికి విశిష్టమైన కందుకూరి వీరేశలింగం పంతులు..వంశీ రంగస్థల జాతీయ పురస్కారంతో అభినందించి జస్టిస్ రాధారాణి ప్రసంగించారు. వీరేశలింగం మహిళల హక్కుల కోసం చట్టాల రూపకల్పనలో ముందుండి పోరాడారని, విధవ వివాహాల ప్రోత్సాహం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళా విద్య విస్తరణ వంటి అంశాల్లో ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. ఇక తనికెళ్ళ భరణి తన రచనలతో, దర్శకత్వంతో తెలుగు సాంస్కృతిక విలువలను ప్రజల్లో బలంగా నాటారని చెప్పారు. ఆయన తెరకెక్కించిన మిధునం, వీడు మగాడ్రా బుజ్జి వంటి చిత్రాల్లోని సంభాషణలు జీవిత సత్యాలను ప్రతిబింబిస్తూ ప్రేక్షకుల మనసులను హత్తుకున్నాయని వివరించారు. ఇదే సభలో తుమ్మలూరి భుజంగదేవ్ లలిత, పట్టాభిరామ్ సూర్యకాంతం భార్గవ పేరు మీద డాక్టర్ భరణి..దుర్గాభవాని దంపతులకు ఆదర్శ దంపతుల పురస్కారాన్ని కూడా అందించారు. వంశీ ప్రచురించిన "చైతన్య ప్రభ" వ్యాసావళిని ఆవిష్కరించారు. డాక్టర్ తెన్నేటి సుధాదేవి మూలకథ ఆధారంగా రూపొందిన తంత్ర సామేతం నాటిక ప్రదర్శన అద్భుతంగా సాగింది. సభలో గౌరవ అతిథులుగా తెన్నేటి పద్మనాభ రావు, కామేశ్వరి , సినీ రచయిత బుర్ర సాయిమాధవ్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, రంగస్థల నటులు రాధా ప్రశాంతి, సుబ్బరాయశర్మ, విజయ గొల్లపూడి, గూడూరు శ్రీనివాస్, జొన్నవిత్తుల కాశీ, నిర్వాహక సంస్థ మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి దాతల సహకారం అభినందనీయం : మాజీ కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి

హైదర్షాకోట్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి.

నార్సింగి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి దాతలు అందజేస్తున్న సహకారం అభినందనీయమైనదని మాజీ కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదర్షాకోట్ ప్రభుత్వ పాథమిక పాఠశాలలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, రౌండ్ టేబుల్ సంస్థ సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంతోషిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సర్కారు బడులలో కార్పోరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు సర్కారు చేస్తున్న కృషి అమోఘమని, దానికి దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చేయూతనివ్వడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ బడుల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద విద్యార్థులు మాత్రమే చదువుతుంటారని, వీరికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఇలాంటి మంచి పనులు మరిన్ని చేపట్టి పేద విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని సంతోషిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సిహ్మా నాయక్, నాయకులు రాజిరెడ్డి,భూపతిరెడ్డి, రెడ్డయ్య, శ్రీశైలంరెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కల కోసం వీధుల్లో నీటి తొట్ల ఏర్పాటు

సికింద్రాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

వేసవి ఎండలు తీవ్రంగా మండిపోతున్న కారణంగా వీధి కుక్కలకు నీటిని అందుబాటులో పెట్టి వాటికి హీట్ స్ట్రెస్‌ను నివారించాలని జీహెచ్ఎంసీ తార్నాక సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి తెలిపారు. కుక్కలను పెంచుకుంటున్నవారు, తమతమ వీధుల్లో తిరిగే కుక్కలు నీటి అసరాలు తీరని పక్షంలో వాటికి ఆందోళన, విపరీత దూకుడు పెరుగుతాయని, పక్కనుంచి ఎవరైనా వెళుతున్నా కోపంతో కరిచే ప్రమాదం ఉంటుందన్నారు. వీధి కుక్కల కోసం సర్కిల్ పరిధిలోని బౌద్ధనగర్, తార్నాక, సీతాఫల్మండి, చిలకలగూడ డివిజన్లలో వీధుల్లోని రోడ్ల పక్కన నీటి తొట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మూగ జీవాల పట్ల మానవత్వంలో వ్యవహరించాలని సూచించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో 750 నీటి తొట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమే పేర్కొన్నారు. వీధి కుక్కల వల్ల ఇబ్బందులు కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని అధికారులు తరలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అధికారి డా. అగ్నివేశ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చార్మినార్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌చౌక్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం...గురువారం కాలికబర్ ప్రాంతంలోని ఒక చెట్టుకు సుమారు 35 ఏళ్ళ వయసు గల ఒక వ్యక్తి ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పరీక్షించగా అతడు కూలీ పనిచేసే వ్యక్తిగా గుర్తించారు. అతని ఛాతిపై కృష్ణవేణి పేరుతో పచ్చబొట్టు ఉంది. వివరాల కోసం పోలీసులు ప్రయత్నించగా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతిడి వివరాలు తెలిసిన వారు మీర్‌చౌక్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

లంగర్ హౌస్‌లో డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు..

కార్వాన్,ఏప్రిల్ 16(ప్రభాతవార్త) లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో తృటిలో పెను ప్రమాదం తప్పింది.మెహిదీపట్నం నుంచి లంగర్ హౌస్ వైపుగా వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగ కపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయినది.కాగా కారు వేగం గా డివైడర్ ఎక్కడంతో దాని టైరు పూర్తిగా దెబ్బతిని ఊడి పోయింది.ఘటన సమాచారం అందుకున్న పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి,ప్రమాదంకు కార ణాలపై దర్యాప్తు చేపట్టారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

ముషీరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: భర్త వేధింపులతో విసిగిపోయి, ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగ్‌కు చెందిన టి.దుర్గ (23) దోమలగూడకు చెందిన జి.పవన్‌ను ప్రేమించి 2022లో పెద్దలను ఎదిరించి వివాహం చేసుకుంది. వారికి ఒక బాబు, ఒక పాప పుట్టిన తరువాత దుర్గ తల్లి తండ్రులు వారి ఇంటికి వస్తూ పోతూ ఉండేవారు. గత కొంత కాలంగా పవన్ మద్యానికి అలవాటుపడి, దుర్గను హింసిస్తూ ఉండటంతో ఆమె తల్లి తండ్రులకు ఫిర్యాదుచేసింది. పెద్దలు పవన్‌ను మందలించటంతో ఇక భార్యను బాగా చూసుకుంటానని మాట ఇచ్చాడు. కానీ పవన్ ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో రెండు నెలల క్రితం దుర్గ పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్థాపంతో పవన్ ఫినాయిల్ సేవించటంతో దుర్గ తిరిగి, భర్త ఇంటికి వచ్చింది. గురువారం ఉదయం దుర్గ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న దుర్గ తల్లి తండ్రులు తమ కుమార్తె ఆత్మహత్యకు కారణం పవన్ వేధింపులేనని దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుర్గ తల్లి టి.అనూరాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

తండ్రి మృతితో మనస్తాపానికి గురై విద్యార్థిని ఆత్మహత్య

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

తండ్రి మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైసమ్మగూడ ప్రాంతంలోని వైభవ్ ఉమెన్ హాస్టల్‌లో నివసిస్తున్న పి. జ్ఞాన శ్రీ (21), మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది.మృతురాలి తండ్రి చెన్నకేశవరెడ్డి ఈ ఏడాది మార్చి 31న మరణించగా, ఆ కార్యక్రమానికి హాజరైన జ్ఞాన శ్రీ, పరీక్షల నిమిత్తం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. బుధవారం పరీక్ష రాసిన ఆమె, గురువారం పరీక్షకు హాజరు కాకుండా మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో హాస్టల్‌కు చేరుకుంది.అనంతరం తన గదిలోకి వెళ్లిన జ్ఞాన శ్రీ, ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతి చెందినట్లు సమాచారం. కొంతసేపటి తరువాత గమనించిన స్నేహితులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు ఘటనాస్థ లానికి చేరుకుని పరిశీలించారు.స్థలంలో శోధన నిర్వహించిన పోలీసులు, మృతురాలి వద్ద నుండి ఒక సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. అందులో తండ్రి మరణంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నట్లు తెలిసింది. కసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

PUBLIC NOTICE

[illegible]

IN THE COURT OF THE HON'BLE [illegible] CITY CIVIL COURT AT SECUNDERABAD

[illegible]

ఒక్క కెమెరా వంద పోలీసులతో సమానం

కాలనీవాసులకు చెక్కు అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ఒక కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని కాలనీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరా నగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ఉపేందర్‌రెడ్డి 50వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నేరం జరిగినప్పుడు వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు వాటిని ఎప్పటికప్పుడు సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంభూపాల్, ప్రధానకార్యదర్శి రాధాక్రిష్ణ, ఎన్ఎస్ఎన్.మూర్తి, పిఎస్. రామన్, కోట శ్రీనివాస్, భీమలింగం, కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, వెంకటరమణరెడ్డి, శశియాదవ్, నగేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: కర్మన్‌ఘాట్ చౌరస్తాలో బైగళ్ల రవీందర్, బైగళ్ల అశోక్, జగదీశ్వర్‌లు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని నిమిత్తం బయటకు వచ్చిన వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు తోడ్పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నుకుమార్, యాదగిరి, వెంకటేష్, జగన్ మోహన్, ప్రభాకర్‌రెడ్డి, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సీజ్

రేషన్ బియ్యం గోదాంను సీజ్ చేస్తున్న అధికారులు

సైదాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ శ్రీనివాస కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గోదాంలో పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేసి 23 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గురించి మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పోలీసులకు, పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని బియ్యాన్ని తనిఖీ చేసి గోదాంను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, జూపల్లి ప్రవీణ్, మనోజ్, యశ్వంత్ పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమానికి అండగా ఉంటాం

ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ బృందం...

కుషాయిగూడ, ఏప్రిల్16, ప్రభాతవార్త

సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తూ తమ శ్రేయస్సును సైతం పట్టించుకోకుండా పాటుపడుతున్న పాత్రికేయుల సంక్షేమం కోసం వచ్చేస్తున్న పాత్రికేయులు డాక్టర్ ఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు పలు ఆలయాల నిర్మాణ కర్త, పలు అన్నదానాలకు దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త కేశెట్టి ప్రసాద్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఎన్నికైన నూతన కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ వారు మర్యాదపూర్వకంగా కలిశారు. సమాజంలో నాలుగో స్తంభమైన పాత్రికేయుల అవసరాల కోసం అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు భద్రగామి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల

ఆస్మాన్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్ పేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. చంచల్ గూడ లో ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, పలువురు అధికారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ వేసవి కాలాన్ని పురస్కరించుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాలలో నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వంగిపోయి శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సలాం షాహిద్, మినాజ్ పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన దర్పల్లి రాజశేఖరెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ఢిల్లీలోని పార్లమెంటులో రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు వేం నరేందర్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి అష్టలక్ష్మి దేవాలయం బ్రహ్మోత్సవాలు

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దేవాలయం ప్రతినిధులు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: అష్టలక్ష్మి దేవాలయం 30వ బ్రహ్మోత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను దేవాలయం ప్రతినిధులు ఆవిష్కరించారు. వారంరోజులపాటు అష్టలక్ష్మి దేవాలయంలో భారీఎత్తున బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తిరుచి పల్లకిసేవ, శేష వాహనసేవ, హంస వాహనసేవ, సూర్యప్రభ వాహనసేవ, చంద్రప్రభ వాహనసేవ, గజవాహనసేవ, హనుమత్ వాహనసేవ, గరుడవాహనసేవ, అశ్వవాహనసేవ, సింహ వాహనసేవ, కల్పవృక్ష వాహనసేవ, చిన్న రథోత్సవం, పెద్ద రథోత్సవం కార్యక్రమాలను వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య నిర్వహిస్తామన్నారు. ఐదు రోజులపాటు శ్రీలక్ష్మీనారాయనేష్టి, శ్రీనృసింహేష్టి, శ్రీహయగ్రీవేష్టి, శ్రీవరాహేష్టి, శ్రీసుదర్శనేష్టి కార్యక్రమాలతోపాటు ఎదురుకోలు ఉత్సవాలు శ్రీలక్ష్మీ నారాయణ కళ్యాణ మహోత్సవము, దేవతోద్వాసన, శ్రీపుష్పయాగము కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాదము, ఫలహారాలు, పండ్లు, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. వాహనసేవలు, రథోత్సవాల సందర్భంగా ఆటపాటలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మాడవీధుల్లో వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు పలువురు స్వామీజీలు హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయం ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. దేవాలయం పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాల అలంకరణలతో పూర్తిగా ఆధ్యాత్మిక భావన వెల్లి విరిసేలా రూపొందించడం జరిగిందన్నారు. భక్తులు పెద్దఎత్తున హాజరై బ్రహ్మోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు మ్యాడం సుధాకర్ గుప్తా, బంధం దామోదర్, దాచేపల్లి శ్రీనివాస్, బోయిని శ్రీనివాస్, చిలుక ఉపేందర్ రెడ్డి, కొక్కొండ చంద్రశేఖర్, మాల శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ, మాలే శ్రవణ్‌కుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : కరస్పాండెంట్ సుభాష్ గౌడ్

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ సుభాష్ గౌడ్ తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని శ్రీవాణి ఉమెన్స్ జూనియర్, డిగ్రీ పీజీ కళాశాలల కరస్పాండెంట్, సెక్రటరీ ఎం. సుభాష్ గౌడ్ పేర్కొన్నారు. మలక్ పేట శ్రీవాణి మహిళా డిగ్రీ కళాశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.సుభాష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధనను అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను పాటిస్తూ తరగతులకు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన సూచించారు. ఎంచుకున్న అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని మంచి ఉద్యోగాలను పొందాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను , సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. విద్యార్థులు ఉత్తమ ఆలోచనలను కార్యరూపంలో అమలుపరచాలని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకుటితదీక్షతో తమ లక్ష్యసాధన కోసం కృషిచేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని వివరించారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతనంగా తీర్చడానికి పునాది వేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఆసక్తి ఉన్న రంగాలను ఎంచు కోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనుప్రియ, కళాశాల అధ్యాపకులు జాన్, అహ్మదుల్లా ఖాన్, రాములు, బిందు, దామిని, సరిత ఠాగూర్, శ్రీలక్ష్మి, నాగరాజు గౌడ్, తిరుమల్ గౌడ్ తదితరులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కామినేని వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి

-హాస్పటల్‌లో మృతిడి బంధువులు, స్నేహితులు ఆందోళన

హాస్పిటల్‌లో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, స్నేహితులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: జూనియర్ డాక్టర్లు తో వైద్యం చేయించి తన భర్త మరణానికి కారణమైన కామినేని హాస్పిటల్ యాజమాన్యమ్ తో పాటు శస్త్ర చికిత్స చేసిన వైద్యుల పై చర్యలు తీసుకోవాలని మృతుడి బంధువులు, మిత్రులు ఎల్బీ నగర్ లో ఉన్న కామినేని హాస్పిటల్ లో ఆందోళనకు దిగి ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్ బాద్ డోర్నకల్ కు చెందిన చిక్కా నరేష్ (40) గత కొంతకాల క్రితం నగరానికి వచ్చి కుంట్లూరు లోని నారాయణ కళాశాలలో రికార్డింగ్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్నాడు. ఐతే ఇటీవల తన ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఎల్బీ నగర్ లోని కామినేని ఆసుపత్రిలో గత శనివారం జాయిన్ అయ్యారు. ఐతే గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న నరేష్ కు ఆపరేషన్ చెయ్యాలని అందుకు సిద్ధంగా ఉండాలని అతని భార్య కు వైద్యులు సూచించారు. కాగా బుధవారం ఉదయం నరేష్ కు గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేసి అంత బావుందని చెప్పిన వైద్యులు అదే రోజు రాత్రి నరేష్ చనిపోయాడని తెలిపారని ఇందుకు జూనియర్ వైద్యుల తో ఆపరేషన్ చేయడం తోటే తన భర్త చనిపోయాడని మృతుడి భార్య సుభాషిణి ఆరోపిస్తూ కామినేని హాస్పిటల్ లో ధర్నా నిర్వహించి ఆందోళనకు దిగారు. దీంతో ఎల్బీ నగర్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తమ సిబ్బందితో వచ్చి ఎలాంటి ఉద్రిక్తత తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కానీ గురువారం ఉదయం నుంచి నరేష్ బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఆసుపత్రి యాజమాన్యం మరియు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే నరేష్ మృతి చెందాడని వారు ఆరోపించారు. అదే విధంగా నరేష్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నరేష్ భార్య సుభాషిణి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తులం బంగారం హామీని అమలు చేస్తారా? : సబితా ఇంద్రారెడ్డి

చెక్కులు పంపిణీ చేసిన సబితా ఇంద్రారెడ్డితో షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల మహిళా లబ్ధిదారులు: చిత్రంలో బాలాపూర్ ఎమ్మార్వో ఇందిరా దేవి, మైనారిటీ నాయకులు ఖైసర్ బామ్, షేక్ అఫ్జల్ తదితరులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మహిళలకు ఇచ్చిన తులం బంగారం హామీని అమలు చేయరా? అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జల్‌పల్లి సర్కిల్‌కు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల మహిళా లబ్ధిదారులకు గురువారం పహడీషరీఫ్ బైపాస్ రోడ్డులోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులైన 360 మంది మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరా దేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సభలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టే పాలన చేస్తున్నదని విమర్శించారు. గత బిఆర్ఎస్ పాలనలో నాటి సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఈ పథకాల కింద చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని మహిళలను మభ్యపెట్టిందని అన్నారు. అయితే తీరా అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా తులం బంగారం హామీని నెరవేర్చడం లేదని ఆయన విమర్శించారు. చెక్కుల పంపిణీ సందర్భంలో మహిళలు తులం బంగారం విషయాన్ని ప్రస్తావిస్తున్నారనీ అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. హామీలను గాలికి వదిలి పేదల ఇళ్ళను కూల్చడమే సర్కార్ ప్రజాపాలన సాగిస్తున్నదని ఆమె అన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళను కూడా అర్హులైన పేదలకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కేటాయిస్తున్నారని ఆమె ఆరోపించారు. కెసిఆర్ అమలు చేసిన ప్రతిష్టాత్మక మిషన్ భగీరథ వల్ల ఆనాడు ఇంటింటికి నల్లా నీరు సరఫరా అవుతే నేడు ఆ పథకానికి సైతం తూట్లు పొడుస్తూ ప్రజలు మంచి నీటికి కటకటలాడే పరిస్థితి నేటి పాలకులు తీసుకొచ్చారని ఆమె విమర్శించారు. చాలా ప్రాంతాల్లో వారానికి ఒక సారి కూడా నీరు సరఫరా కాకపోవడంతో మహిళలు తీవ్ర ఆందోళనతో ఉన్నారని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారానైనా సరఫరా చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ వెంకట్రామ్, నాయకులు ఖైసర్ బామ్, షేక్ అఫ్జల్, సూరెడ్డి కృష్ణారెడ్డి, యాంజాల జనార్ధన్, యాతం పవన్‌యాదవ్, కాట్రగడ్డ వాసుబాబు, శంకర్, సుభాష్, సయ్యద్ అబ్బాస్, అజ్జు, బర్కత్ అలీ, ఆరిఫ్, సయాద్ పటేల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పాయ్ నగర్ అండర్ బ్రిడ్జ్ పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే మర్రి

నేరెడ్ మెట్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త : మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని వాజ్‌పాయ్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌ను కోరారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఔటర్ రీజినల్ రింగ్ రోడ్ పరిధిలోని రహదారులను జిహెచ్ఎంసికి బదిలీ చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా వాజ్‌పాయ్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి ఇప్పటికే రైల్వే బోర్డు అనుమతి లభించినప్పటికీ, పనులు ప్రారంభంలోనే నిలిచిపోయినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టును ప్రత్యేక అంశంగా పరిగణించి, రహదారులు మరియు భవనాల శాఖ ఆధ్వర్యంలోనే పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలు దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్టును ఆలస్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సమస్యను సానుకూలంగా పరిగణిస్తూ, వెంటనే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. పనులు వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు దోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, పవన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలి

తుర్కయంజాల్ సర్కిల్ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య

తుర్కయంజాల్ ఏప్రిల్ 16(ప్రభాతవార్త)

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్దిదారులకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుర్కయంజాల్ సర్కిల్ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య పేర్కొన్నారు. గురువారం ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ కమ్మగూడ పరిధిలోని చెందిన లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఐలయ్య వారు బాధితులు బాయ్ ముత్క రమాదేవి, మరియు వెంకటేష్ వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి సహకారంతో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్దిదారులకు అందజేశామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు గతంలో కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగా ఉండేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిఎం సహాయనిధి ద్వారా ప్రస్తుతం ఏ ఆస్పత్రిలోనైనా వైద్యం చేయిం చుకునే సదావకాశం లభించిందన్నారు. ప్రభుత్వం పథకాలను ప్రజలకు చేరువచేసేందుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ గౌడ్, బాలు, బాయ్ ముత్క రాజేష్, తదితరులు పాల్గొన్నారు

అనాథ పిల్లలతో జన్మదిన వేడుకలు

నేరెడ్ మెట్,మల్కాజిగిరి, ఏప్రిల్ 16,ప్రభాతవార్త : సామాజిక బాధ్యతను చాటుతూ మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ కుమారుడు వై. పవన్ కుమార్ తన జన్మదినాన్ని అనాథ పిల్లలతో కలిసి ప్రత్యేకంగా జరుపుకున్నారు. పివిఎన్ కాలనీలోని ఫ్యూచర్ ఫౌండేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం అక్కడి పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రశాంత్ కుమార్, ప్రేమలత, సాయిచరణ్, సందీప్, మోనిక తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగుతూ, పిల్లల్లో ఆనందాన్ని నింపింది.

బిసి జన జాగరణ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పల్‌లో బీసీ జన జాగరణ జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

ఉప్పల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19 తేది నగరంలో జరిగే బీసీ జన జాగరణ జాతర పోస్టర్‌ను గురువారం చిలుకానగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బిసి నేత నేర్ధం భాస్కర్ గౌడ్, అంబటి జగదీష్ ముదిరాజ్, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, పుప్పాల వెంకటేశ్వర్లు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన శ్రీనివాస్, అడ్వైజర్ జరిపోతుల నాగరాజుగౌడ్, దేవసాని బాలచందర్, జల్లి మోహన్, షేక్ మదర్, అల్తాఫ్, దన్‌సాగర్, చంద్రశేఖర్ గౌడ్, విద్యాసాగర్, గోనే అంజయ్య, తెలంగాణ సంపత్, ఆలే నరేందర్, నాగార్జున, కావలి నరసింహ,ఎక్కల దేవి నర్సింలు ముదిరాజ్, గిర్మాజీ శ్రీనివాస్ చారి, మల్లం నరేష్ గౌడ్, నరసింహ చారి, కృష్ణ నాయక్ చంద్రయ్య, రాగిరి జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19 తేదీన జరగనున్న బీసీ జన జాగరణ జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి సంఘం నేతలు పాల్గొన్నారు.

మ్యాన్ హోల్ గుంతలతో ప్రమాదాలు : ప్రజావాణి శ్రీనివాస్

రామంతాపూర్‌లో మ్యాన్ హోల్ గుంతలను చూపిస్తున్న ప్రజావాణి సంస్థ నాయకులు ఎర్రం శ్రీనివాస్ తదితరులు

రామంతాపూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : రామంతాపూర్ ఎడిఆర్ఎం ఆసుపత్రి నుంచి పాత రామంతపూర్ వరకు కొత్తగా రోడ్డు వేసి మ్యాన్ హోల్ గుంతలు పూడ్చటం మరిచిపోయారని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, కార్యదర్శి జి.విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు టి.రవీందర్రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్‌లో మ్యాన్ హోల్ గుంతలను వారు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన రోడ్డును నెలల తరబడి వేశారని, రెండో లేయర్ వేయడానికి 6 నెలల సమయం తీసుకున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రోడ్డు పనులు పూర్తి అయిపోయినా ప్రాంతంలో ఉన్న 63 మ్యాన్ హోల్స్ కవర్స్‌ను రోడ్డుకు సమానంగా వేయాలని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పూర్తి చేయాలని కోరారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ఉప్పల్ ఎల్ఎఫ్‌జెసి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఐఎఎస్ అధికారి శ్రీ అజయ్ మిశ్రా, బ్రదర్ అరుణ్ ప్రకాష్ తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన వార్షికోత్సవ వేడుకలు గురువారం గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ రెవరెండ్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, డైరెక్టర్ రెవరెండ్ బ్రదర్ జాన్ కల్లరాకల్, ప్రిన్సిపాల్ శ్రీమతి జయంతిరెడ్డి పలువురు అధ్యాపకులు విద్యార్థులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయంతి రెడ్డి కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాల సాధించిన అకాడమిక్ మరియు కో కరిక్యులర్ విజయాలను వివరించారు. విద్యార్థులు మరియు అధ్యాపకుల కృషి వల్ల కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించిందని ఆమె తెలిపారు. వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులు, 9.5 పైగా సాధించారని తెలిపారు. ముఖ్య అతిదిజ అజయ్ మిశ్రా మాట్లాడుతూ అధ్యాపకుల విజయాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్ రెవరెండ్ బ్రదర్ జాన్ కల్లరాకల్ అధ్యాపకులు మరియు విద్యార్థులను అభినందిస్తూ, అన్ని రంగాలలో వారు సాధించిన విజయాలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డికి రాఘవేందర్‌రెడ్డి అభినందనలు

రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్‌రెడ్డిని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన అల్మాస్‌గూడ కాంగ్రెస్ నాయకుడు, నియోజకవర్గం యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి సన్మానించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులతో నరేందర్‌రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

నేడు బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

సరూర్‌నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించే నిమిత్తం ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, ఐక్యూఎసి కో–ఆర్డినేటర్ డాక్టర్ రామరాజ్‌తో పాటు డాక్టర్ రేవంతి, డాక్టర్ జ్యోతి తదితరుల సమన్వయంతో ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తున్నారు. ఐటి, రిటైల్, హెల్త్ కేర్, బ్యాంకింగ్, సేల్స్ రంగాలకు చెందిన పలు సంస్థలు ఈ జాబ్ మేళాలో పార్టిసిపేట్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు తమ రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యా సర్టిఫికెట్లతో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు. అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని ఆయన తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

-సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సైదాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సంతోష్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రగతి పాలనలో భాగంగా అరైవ్..అలైవ్ పేరిట ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సంతోష్‌నగర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని వాహనదారులు, బాటసారులు, ట్రాఫిక్ పోలీసులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులేనని ఆయన స్పష్టం చేశారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడుపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసుకు వెళ్తానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యం

నేరెడ్ మెట్ , ఏప్రిల్ 16,ప్రభాతవార్త : ఆఫీసుకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరిన యువతి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వినాయకనగర్‌కు చెందిన గుమ్మడి గీతా (18) అనే యువతి ఏప్రిల్ 15వ తేదీ ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. యువతిని చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి గుమ్మడి గోపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన యువతి ఎత్తు సుమారు 5.2 అడుగులు ఉండగా, పంజాబీ దుస్తులు ధరించి ఉంది. తెలుగు, కన్నడ భాషలు మాట్లాడగలదు. వుమన్ మిస్సింగ్‌గా నమోదు చేసి, పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. యువతి గురించి ఏదైనా సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.